ప్రజాశక్తి
సోమవారం 18 నవంబర్ 2024 | 5 | కర్నూలు

ఉద్యోగులకు భరోసా పిఎఫ్

- రూ.15వేల లోపు బేసిక్ వేతనం ఉన్న వారు అర్హులు
- పదేళ్ల సర్వీస్ దాటితే పెన్షన్
- పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

"సమాజంలో ఉన్న ప్రజలు, ఉద్యోగస్తులు తాము సంపాదించుకున్న మొత్తంలో ప్రతి నెల కొంత సొమ్ము పొదుపు చేసుకున్నట్లయితే అది భవిష్యత్తులో వారి అవసరాలకు లేదా వృద్ధాప్యంలో ఉపయోగ పడుతుంది. శేష జీవితం ఎలాంటి ఇబ్బందులు లేకుండా గడుపుకోవచ్చు" అని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) అసిస్టెంట్ కమిషనర్ ఎ.రవీందర్ తెలిపారు. రూ.15వేల లోపు బేసిక్ వేతనం ఉన్న వారు పిఎఫ్‌కు అర్హులని, పదేళ్ల సర్వీస్ దాటితే పెన్షన్ అందుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

పిఎఫ్ అంటే ఏమిటి..? పిఎఫ్ వల్ల ప్రయోజనం ఏమిటి..?

ఎసి : ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలో పనిచేసే ఉద్యోగస్తులు, కార్మికులు కొంత ధనాన్ని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) పేరుతో పొదుపు చేసుకుంటే అంతే ధనం ప్రభుత్వము లేదా యాజమాన్యాలు కలిపి జమ చేస్తారు. ఆ సొమ్మును ఉద్యోగస్తులు పదవీ విరమణ చేసినప్పుడు ఎక్కువ మొత్తంలో తీసుకోవడానికి అవకాశంగా ఉంటుంది. ఈ విధంగా కట్టుకోవడం వల్ల పొదుపుతో పాటు జీవిత బీమా, పెన్షన్ లభిస్తుంది. ఉద్యోగం చేస్తూ వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే భార్యకు రూ.వెయ్యి, పిల్లలకు రూ.750 చొప్పున పెన్షన్ రూపంలో ఇవ్వడం జరుగుతుంది.

పెన్షన్ ఎవరికి ఇస్తారు?

ఎసి : పిఎఫ్ మొత్తం చెల్లిస్తున్న ఉద్యోగి 10 సంవత్సరములు పూర్తి సర్వీస్ చేసి ఉంటే పెన్షన్ ఇస్తారు. ఈ పెన్షన్ బేసిక్ పైన లెక్క కట్టిస్తారు. పనిచేసిన సంవత్సరాలు ఇంటూ బేసిక్ వేతనం బై 70 లెక్క కట్టి పెన్షన్ ఇస్తారు.

ఏయే సంస్థల్లో ఎంతమంది ఉద్యోగులు ఉంటే పిఎఫ్ వర్తిస్తుంది?

ఎసి : ఆసుపత్రులు, ఫ్యాక్టరీలు, పాఠశాలలు, కళాశాలలు, హోటల్లు, సూపర్ మార్కెట్లు, కార్ షోరూమ్‌లు, బట్టల షాపులలో కనీసం 20 మంది ఉంటే పిఎఫ్ వర్తిస్తుంది. సినిమా థియేటర్లలో ఐదు మంది ఉన్నా కూడా పిఎఫ్ వర్తిస్తుంది. బేసిక్ వేతనం రూ.15,000 లోపుఉంటే వర్తిస్తుంది. ఆపైన ఉంటే వర్తించదు.

పెన్షన్ అదాలత్ ఎప్పుడు ఉంటుంది?

ఎసి : పిఎఫ్ పెన్షన్‌కు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పెన్షన్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ప్రతి నెల 11వ తేదీన ఉదయం 11 గంటల నుండి 11:40 నిమిషాల లోపు పెన్షన్ అదాలత్ ఉంటుంది. ప్రతి నెల 30 నుండి 40 మంది లోక్ అదాలత్‌కు వస్తూ ఉంటారు.

కర్నూలు జిల్లాలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారు? ఎంత మంది పిఎఫ్ ఖాతాదారులు ఉన్నారు?

ఎసి : నాతో పాటు ఇద్దరు ఇన్స్పెక్టర్లు, ముగ్గురు క్లర్కులు, ఒక అటెండర్ పనిచేస్తున్నారు. నేను కర్నూలు, అనంతపురం జిల్లాలను పర్యవేక్షిస్తున్నాను. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పిఎఫ్ ఖాతాదారులు 2500 మంది ఉన్నారు.

పిఎఫ్ ఖాతాదారులు తమ సమస్యల పరిష్కారానికి ఎంత మంది వస్తుంటారు?

ఎసి : ప్రతి రోజు 20 దాకా వస్తుంటారు. నెలకు 250 మంది దాకా సమస్యలను పరిష్కరిస్తూ ఉంటాం. ఇన్స్పెక్టర్లు విచారణ జరిపి వారి డేటా సరిగా ఉన్నదా లేదా వాస్తవమా కాదా అనేవి పరిశీలించిన అనంతరం వారికి న్యాయం చేయడం జరుగుతుంది.

పెన్షన్‌దారులు ప్రతి సంవత్సరం ఏ నెలలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలి?

ఎసి : పిఎఫ్ పెన్షన్‌దారులు ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలో సమీపంలోని పోస్ట్ ఆఫీస్‌లో తాము బతికి ఉన్నట్లు లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

ఖాతాదారులు సంవత్సరానికి ఎంత మంది మరణిస్తుంటారు?

ఎసి : సరాసరి సంవత్సరానికి 42 నుండి 50 మంది దాకా మరణిస్తూ ఉంటారు.

పిఎఫ్ ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు ఏమైనా చేస్తుంటారా?

ఎసి : ప్రతి నెల 27వ తేదీన ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పిఎఫ్ వల్ల ప్రయోజనాలను తెలియజేస్తూ ఉంటాం. ప్రైవేటు ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ప్రతి ఒక్క ఉద్యోగి తమ హక్కులను గురించి అడిగితే సేవింగ్స్, ఇన్సూరెన్స్, పెన్షన్లు పొందవచ్చు. పిఎఫ్ ఖాతాదారులు ప్రతినెలా 27వ తేదీన జరుగు అవగాహన కార్యక్రమాలకు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

టిడ్కో గతి మారేనా..?

మౌలిక వసతులు కరువు
నివాసానికి అనుకూలంగా లేని వాతావరణం

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వంలో టిడ్కో పరిస్థితి మారుతుందా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్‌ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

26న మహాధర్నాను జయప్రదం చేయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినాశకర విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక, రైతులు సంఘటితమై ఈ నెల 26న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూల్ నగరంలోని ఎపి వేర్‌హౌస్ హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశం కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి వేర్ హౌస్ హమాలీ యూనియన్ కార్యదర్శి ఎం.మల్లికార్జున అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్‌లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రాల్లో దాని భాగస్వామ్య పక్షాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆందోళనలో కార్మికులు, రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు కూడా భాగస్వామ్యం కానున్నారని చెప్పారు. వ్యవసాయరంగ కార్పొరేటీకరణ, జీవనోపాధులపై బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న దాడులను తిప్పి కొట్టాలన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో విశాల ప్రజా ఉద్యమాలను నిర్మించాలని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అందరికీ ఉపాధి, 200 రోజులు పని, ఉపాధి హామీ కింద రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న కర్నూలు కలెక్టరేట్ దగ్గర ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నా కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, వేర్ హౌస్ హమాలీ యూనియన్ అధ్యక్షులు విష్ణుమూర్తి, ఉపాధ్యక్షులు కె.సుధాకర్, సహాయ కార్యదర్శి ఎం.పురుషోత్తం, ట్రెజరర్ టీ.కె.మధు, కె.రంగన్న, ఆర్.గోవిందు, ఎన్.ఇసాక్, విజయుడు, చెన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలను స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

44వ వార్డులో కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని 44వ వార్డు వెంకటరమణ కాలనీలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, స్థానిక కార్పొరేటర్ రాజేశ్వర్ రెడ్డితో కలిసి ఆదివారం పర్యటించారు. పలు వీధుల్లో నెలకొన్న సమస్యలను, కార్పొ రేటర్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, పార్కు స్థలాల అభివృద్ధి, పారిశుధ్య తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు వంటి సమస్యలను పరిశీలించిన కమిషనర్, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాతీయ బాస్కెట్‌బాల్‌కు రిడ్జ్ ఎంపిక

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రిడ్జ్ పాఠశాల విద్యార్థి పి.జీవన్ అండర్ 14 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల సిఇఒ గోపీనాథ్, సౌమ్య గోపీనాథ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థి ఈనెల 18 నుండి 22 వరకు ఛత్తీస్‌ఘడ్ లోని రజ్ఞానుగొన్ పట్టణంలో జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి అభినందనలు తెలిపారు. విద్యార్థి ప్రతిభకు కారకులైన బాస్కెట్బాల్ కోచ్ షబీర్ అలీని అభినందించారు. పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, వ్యాయామ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సహకారం అందిస్తాం..సాధించండి ...

తైక్వాండో పోటీల లోగోను ఆవిష్కరించిన టిజి.వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు తాను, రాష్ట్ర మంత్రి టిజి. భరత్ ఆర్థిక సహకారం అందిస్తామని, క్రీడాకారులు లక్ష్యాలు సాధించాలని మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటష్ అన్నారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో జిల్లా ఓపెన్ తైక్వాండో పోటీల లోగోను ఆవిష్కరించారు. జిల్లా జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిసెంబర్ 14న సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగంలో 4 ఈవెంట్లు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.అజయ్, టి.తేజ, నందిని, విశ్వాస్ రావు, టీ.తిలక్, అఖిల్, టి.సాయికృష్ణ, శివమణి, హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రతిపౌరుడు సమాజంలో తలెత్తుకుని బతకాలి

ఆర్‌యు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఎన్‌టికె నాయక్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కంప్యూటర్ యుగంలో సెల్ఫోన్ వాడకం ఎక్కువైందని, మంచి పుస్తక పఠనంద్వారా తల దించుకొని చదివినా జీవితంలో స్థిరపడి తలెత్తుకొని బతుకవచ్చునని రాయలసీమ యూనివర్సిటీ ఇన్చార్జి కులపతి డాక్టర్ ఎన్‌టికె.నాయక్ అన్నారు. అందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలలో భాగంగా కవిసమ్మేళనం ద్వారా '**పుస్తకం నానేస్తం**' అనే అంశంపై కవులు కవితారూపంలో వివరించారు. ముఖ్య అతిథి ఎన్‌టికె. నాయక్ మాట్లాడారు. విద్యార్థులు గ్రందాలయంయొక్క ప్రాధాన్యతను , పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. ఈ లేటెస్ట్ యుగంలో కంప్యూటర్ సెల్ఫోను వాడకలో మనం ఎక్కువ సేపు గడుపుతున్నారని వాటిని మంచికోసం ఉపయోగించుకోవాలని అన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌యు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఎన్‌టికె నాయక్

మనం చెడు మార్గంలో పయనిస్తే తలెత్తుకొనేలా కాకుండా తలదించుకొని జీవించేలా ఉంటుందన్నారు. అదే మంచి పుస్తక పఠనంద్వారా తల దించుకొని చదివినా జీవితంలో స్థిరపడి తలెత్తుకొని బతుకవచ్చునని అన్నాన్నారు. అందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కవులతో కవిసమ్మేళనంను ప్రారంభించారు. జెఎస్‌ఆర్ కె శర్మ అధ్యక్షతన సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ నిర్వహించారు. కవులు వెంకట సుబ్బలక్ష్మమ్మ, గద్వాల సోమన్న, సయ్యద్ జహీర్ అహమ్మద్, ఇనాయతుల్లా, ఆవుల బసప్ప, బోయశేఖర్,స్వరూప్ సిన్హా తదితర కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. గద్వాల సోమన్న రాసిన చిరు మువ్వలు అనే పుస్తకాన్ని ముఖ్య అతిథి చేతులు మీదుగా ఆవిష్కరించారు. తదనంతరం కార్యదర్శి, ముఖ్య అతిథి కవులను కండువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇంజనీరు ముచ్చుకోట చంద్రశేఖర్, డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క,లైబ్రేరియన్స్ ఎస్. బాష, చంద్రమ్మ, నషీమా, రేణుక, శ్రీనువాసులు, బాస్కర్, ఉమ, తదితర గ్రందాలయ సిబ్బంది , .విద్యార్థినీ ,విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవి స్వరూప్‌సిన్హాను సన్మానిస్తున్న విసి ఎన్‌టికెనాయక్

ప్రతి ఫిర్యాదుకు ఆధార్ కార్డు తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదు దారులు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా ఎస్‌పి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు టు టౌన్ పోలీసుస్టేషన్ , కొత్తపేట దగ్గర గల ఎస్‌పి కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదు దారులు తమతో పాటు తప్పని సరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని , జిల్లా ప్రజలు ఇది గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వీధిలైట్లు వేసి..దొంగతనాలు అరికట్టాలి

శివారు కాలనీల ప్రజల ఆవేదన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ పశ్చిమ ప్రాంత శివారు కాలనీలలో వీధిలైట్లను వేసి, దొంగతనాలను అరికట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, స్థానిక కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ధర్మరాజు, సుకుమార్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు ప్రభుత్వ అధికారులను కోరారు. ఆదివారం స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పార్థసారధి నగర్,రిచ్ మండ్ కాలనీ, సురేష్‌హోమ్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిచ్‌మండ్ కాలనీ సమీపంలోని సురేష్ హోమ్ లో నాగార్జున పుణ్యక్షేత్రానికి వెళ్లిన విషయాన్ని పసిగట్టిన దొంగలు గత రాత్రి దాదాపు రూ.20 లక్షల మేర దొంగలించారని తెలిపారు. రోడ్లు వేయకపోవడం మురికాలువలు నిర్మించకపోవడం వల్ల కచ్చా రోడ్లకు ఇరువైపుల కంప చెట్లు పెరగడం, వీధిలైట్లు లేక మారుమూల గ్రామాల కంటే వెనకబడినట్లు తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకొని వెంటనే వీధిలైట్లు వేయించడంతోపాటు రోడ్లు, మురికి కాలువలు, పార్కులు నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో సివి వర్మ, యన్ పీటర్. నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, అనిల్,చెంగయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు లేని స్థంభాలను చూపుతున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి, తదితరులు

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ కనిమొలితో ఎంపి బస్తిపాటి నాగరుజ

జైపూర్‌లో పర్యటించిన ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం , ప్రజా పంపిణీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో అధ్యయన పర్యటన నిర్వహించింది. రెండు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళితో కలిసి కమిటీ సభ్యులు ప్రముఖ బ్యాంకుల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా బ్యాంకింగ్ రంగంలో వినియోగదారుల హక్కులను రక్షించడం , అన్యాయమైన విధానాల నుండి ప్రజలను మేల్కొల్పడం, వారి హక్కులను కాపాడడం పై చర్చించారు. అనంతరం సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ప్రతినిధులతో సమావేశమై ఆహార గోడౌన్లలో ఆహార ధాన్యాల వృధా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలు ఉండేలా పరీక్ష సౌకర్యాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా ఎం.పి నాగరాజు కమిటీ సభ్యులతో కలిసి జైపూర్ లోని పలు పర్యాటక ప్రదేశాలను సందర్శించారు.

నేడు సిపిఐ రాష్ట్రకార్యదర్శి రాక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు 18న సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కర్నూలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ వస్తున్నారని ఆదివారం సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ,నగర్ సహాయ కార్యదర్శి మహేష్ జి .చంద్రశేఖర్ డి .శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

స్కూలుకు వెళ్లాలని మందలించినందుకు...

ప్రజాశక్తి-సి బెళగల్

పదో తరగతి చదువుతున్న విద్యార్థి కురువ శివప్రసాద్ (16) ను స్కూలు కు సక్రమంగా వెళ్లాలని తల్లిదండ్రులు మందలించినందుకు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్కూలు కు పదే పదే డుమ్మా కొడుతున్నాడని తల్లిదండ్రులు పరమేష్ శుక్రవారం మందలించారు. ఇది ఇమడని ఆ విద్యార్థి వాము దొడ్డిలో ఉన్న పురుగు మందుతాగాడు. అక్కడ కొందరు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. ఇద్దరు కుమారులలో ఒకరు మరణించడం కుటుంబంలో విషాదం నెలకొంది.ఎస్ తిమ్మారెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేదవతి నిర్మాణం సాధనకు రౌండ్ టేబుల్

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వాలు,పాలకులు మారిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉందని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్ అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశం లో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీరు అందించేందుకు 8 టిఎంసిలతో వేదవతి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంతం శాశ్యశామాలం అవుతుందని సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు, పాదయాత్రలు, ధర్నాలు చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లితే గత వైసిపి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టిన అర్ధంతరంగా నిధులు లేక నిర్మాణపనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్‌లో వేదవతి, నగరడోనా రిజర్వాయర్ లకు నిధులు కేటాయంచక పోవడం బాధాకరమన్నారు. కావున రాజకీయ పార్టీలకు అతీతంగా,ప్రజాసంఘాలు కలసి రిజర్వాయర్‌లకు నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టి నియోజకవర్గ ప్రజలను ఆదుకొనేందుకు సోమవారం సిపిఎం ఆధ్వరంలో చేపట్టే రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు క్రిష్ణ, ఈశ్వర్ గౌడ్, ఈరన్న, నాగరాజు, విఠల్, పరమేష్, కె.నాగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు కెపి నారాయణస్వామి

వాల్మీకులకు సంక్షేమ భవనం

వాల్మీకుల వనభోజన కార్యక్రమం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వాల్మీకులకు సంక్షేమ భవనం నిర్మిస్తామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వరరెడ్డికి వాల్మీకి సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్ ప్రక్కనగల గ్లోబల్ ఇండస్ స్కూల్ నందు ఎమ్మిగనూరు వాల్మీకి వనభోజన సమితి నాయకులు బంగారు వెంకటేష్, రాఘవన్, కొండయ్య, మల్లయ్య కృష్ణమూర్తి, హుసేని, రామకృష్ణ, నారాయణ, రంగన్న ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించిన అనంతరం తులసి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల శబ్దాలతో గ్లోబల్ ఇండస్ స్కూల్ నుండి ఆదోని బైపాస్ రోడ్ నందు గల ఆంజనేయస్వామి దేవాలయం దగ్గరకు చేరుకుని పూజలు నిర్వహించారు. తదుపరి నాయకులందరూ గ్లోబల్ ఇండస్ స్కూల్ నుండి వాల్మీకి సర్కిల్‌కు బైక్ ర్యాలీ నిర్వహించి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం సభ సాంస్కృతి కార్యక్రమాలతో ప్రారంభమైంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 80 వేలపైచిలుకు ఓటు బ్యాంకు కలిగిన వాల్మీకి సమాజానికి సంక్షేమ భవన నిర్మాణ నిమిత్తం స్థలాన్ని కేటాయించడమే గాక సంక్షేమ భవన నిర్మాణాన్ని కూడా త్వరలోనే సుసాధ్యం చేస్తానని వాగ్దానం చేసినందుకు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి చిత్ర పటానికి పూజలు చేస్తున్న మహిళలు

విశిష్టమైన వృత్తి జర్నలిజం

ప్రజాశక్తి - ఆదోని

ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిజం కత్తి మీద సాము లాంటిదని వారికి అండగా ఉండాల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాద్ రావు, అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్త తెలిపారు. జర్నలిస్ట్ డే సందర్భంగా సీనియర్ విలేకరులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ఆయా సందర్భాలలో సన్మానం చేసి వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. పత్రికారంగంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగ జర్నలిస్టులు చేస్తున్నారని ఎనలేని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాశక్తి మునెప్ప, ఈనాడు యువరాజు, సాక్షి నాగరాజు, ఆంధ్రప్రభ వెంకటేష్, ఆంధ్రజ్యోతి చిన్న, వార్త రఘు, ఆంధ్ర పత్రిక గౌస్ మమ్మద్, విశాలాంధ్ర మహమ్మద్ హుస్సేన్, చంద్ర వార్త ఈరన్న మొదలగు అన్ని ప్రముఖ దినపత్రికల పాత్రికేయులను శాలువాతో సన్మానం చేసి అభినందించారు. ఆవోపా, వామ్ అధ్యక్షుడు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్త, కార్యదర్శు యాతగిరి వెంకటేశ్వర్లు సభ్యులు, వెంకటేష్ బాబు, కిరణ్ , అవోపా వామ్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు, వంకదారు మమతా శ్రీ, బుడూరు సంగీత, ప్రతాప్ హిమబిందు, లయన్స్ క్లబ్ కార్య వర్గం వన్నప్పరాజు, మల్లికార్జున్ గౌడ్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వహికులు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని హవనపేట్ సర్కిల్లో ఉర్దూ ఎలిమెంటరీ పాఠశాలలో ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ జునైద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని టూటౌన్ సీఐ సూర్య మనోహర్ రావు, ఆదోని ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మజర్ అహ్మదులు ప్రారంభించారు. డాక్టర్ షఫీ ఉల్లా, వారి సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా సిఐ సూర్య మనోహర్ రావు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేపట్టాలన్నారు. ఆదోనిలో అందరూ కలిసిమెలిసి ఉన్నారని, ఇలాగే ఎల్లప్పుడూ ఉండాలని సూచించారు. ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మాట్లాడుతూ ఇప్పటికే తాము గత 10 వారాలుగా ప్రతి శుక్రవారం రోజు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు వారి బంధువులకు భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం చిన్నారులు, వృద్ధులు అనేకమంది అనారోగ్యం బారిన పడుతున్నారని వారికి తమ వంతుగా సేవ చేయడానికి ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టేందుకు మరి కొంతమంది ముందుకు రావాలని కోరారు. కులమాతలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని కోరారు. ఆదోనిలో ఎప్పుడు శాంతి నీ ప్రజలు కోరుకుంటున్నారని గతంలో కొంతమంది స్వార్థం వల్ల ఆ ఘటనలు జరిగాయని అవి పీడకల ల మరిచి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ నవీద్ పీర్ సాహెబ్, ఎస్ఎంబి అను, ఫిరోజ్ అహ్మద్ రషీద్ పటేల్, ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. చికిత్సల కోసం వచ్చిన వారికి ఎంఐఎం పార్టీ నాయకులు నాసిర్ హుస్సేన్, సద్దాం హుస్సేన్, సాజిద్ బాష, అహ్మద్ హుస్సేన్ తదితరులు సేవలు అందించారు.


చిన్నారికి వైద్యం చేస్తునన దృశ్యం

కూలిన సామూహిక మరుగుదొడ్డి

- ఇబ్బందులు పడ్డ మహిళలు
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం అంటున్న మహిళలు

ప్రజాశక్తి - ఆదోని

ఆరుబయట మలవిసర్జన వల్ల రోగాలు వ్యాప్తి చెందుతాయని నిత్యం అధికారులు చెబుతూనే ఉంటారు ఉన్న మరుగుదొడ్డికి మరమ్మత్తులు చేయించాలని విన్నవించినా స్పందించకపోవడంతో ఉన్న సదుపాయము కూడా అందుబాటులో లేని పరిస్థితి దాపురించింది. ఆదోని పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీలో పేదలే నివసిస్తున్నారు. కొందరికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నప్పటికీ చాలామందికి ఆ సదుపాయం లేదు. చిన్నపాటి ఇళ్లల్లో నివాసం చేసే వారి సంఖ్య అక్కడ అధికంగా ఉన్నారు. అలాంటి వారి మల, మూత్ర విసర్జన కోసం గతంలో సామూహిక మరుగుదొడ్డి నిర్మించారు. మరుగుదొడ్డి ఉన్నా అక్కడ సదుపాయాలు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటి వసతి విద్యుత్ సదుపాయము లేదు. ఉన్న మరుగుదొడ్డి ఆలనా పాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని ఇటీవలనే మహిళలు ఆందోళనకు కూడా చేశారు. మరుగుదొడ్డి శితిలావస్థకు చేరుకుందని మరమ్మత్తులు చేయించాలని స్థానిక మహిళలు ఇటీవలనే నిరసన కూడా చేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ మరుగుదొడ్డి పరిసరాలను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్రత నెలకొని ఉండడాన్ని చూసి శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. మరుగుదొడ్డికి వెంటనే మరమ్మతులు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చకపోవడంతో ఉన్న మరుగుదొడ్డి కూడా కూలిపోయింది.

మల, మూత్ర విసర్జనకు ఎక్కడికి వెళ్ళాలి?

ఉన్న మరుగుదొడ్డి కూలిపోవడంతో మల మూత్ర విసర్జనకు ఎక్కడికి వెళ్లాలంటూ మహిళలు ఆందోళన చెందుతున్నారు. కాలనీ చుట్టూ ఇల్లు ఉన్నాయని ఆరు బయటకు వెళ్లాలంటే ఎలాంటి దాపు లేదని తమ అవసరాలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి సమస్యలను కూడా అధికారులు నిర్లక్ష్యం వహించడం ఏమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయించి నీరు విద్యుత్ సదుపాయం కల్పించి వాడకంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కౌన్సిల్‌లో అడిగినా పట్టించుకోలేదు

- ఫయాజ్ అహ్మద్, కౌన్సిలర్

నిజాముద్దీన్ కాలనీలో మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరుకుందని మరమ్మత్తులు చేయించాలని కౌన్సిల్ సమావేశంలో అడిగిన అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల కురిసిన వర్షానికి అప్పటికే శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్డి పడిపోవడం జరిగింది. దాదాపు నాలుగు నెలల నుంచి అధికారులకు చెబుతున్న ఇప్పుడు చేస్తాం అప్పుడు చేస్తామనే చెప్తూనే కాలయాపన చేశారు. ఏరియా ప్రజలు ఇబ్బంది పడకుండా సత్వరమే మరుగుదొడ్డికి మరమ్మత్తులు చేయించాలి. లేనియెడల కాలనీ మహిళలతో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తాం.

సమస్య వివరిస్తున్న కౌన్సిలర్ యాజ్ అహ్మద్

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

ప్రజాశక్తి-నందవరం

నందవరం గ్రామంలో బెల్ట్ షాప్లు విచ్చలవిడిగా ఏర్పడ్డాయి. బెల్టు షాపు నిర్వాహకులు రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అమ్మకాలు నిర్వహించినా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. గత కొంతకాలంగా మద్యం అమ్మకాలకు రేట్లు పెంచి అమాయక ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. గ్రామంలో వైన్‌షాప్ లేకపోవడం వల్ల మద్యం ప్రియులు బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. వేరే గత్యంతరం లేక బెల్ట్ షాపులో మద్యాన్ని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతుంది. గ్రామంలో ఎటు చూసినా కర్ణాటక టెట్రా ప్యాకెట్లు పడి ఉన్న సంబంధిత అధికారులు మాత్రం అటువైపు చూడరు. కర్ణాటక మద్యం నిర్వాహకులు సంచిలో వేసుకుని గ్రామంలో తిరుగుతూ ప్రజలకు ఇంటి దగ్గరకే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. బస్టాండు వీధిలో బెల్ట్ షాపులు ఉండడం వల్ల సాయంత్రం వేళ మహిళలు తిరగ లేని పరిస్థితి నెలకొంది. కొన్ని రోజుల క్రితం బెల్ట్ షాపు నిర్వాహకులు 150లకు క్వాటర్ బాటిల్ అమ్మేవారు. ఇప్పుడు బాటిల్ పైన రూ.పది పెంచి 160 అమ్మి బెల్ట్ షాప్ నిర్వాహకులు మందుబాబులు జేబులకు చిల్లులు వేస్తున్నారు.అధిక ధరలకు మద్యాన్ని విక్రయించడం వల్ల మందుబాబులు తీవ్ర అసహనానికి గురైనారు. బెల్టు షాపు నిర్వాహకుల పైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజల కోరుతున్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీలో రూ.95వేల పెనాల్టీ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండల పరిధిలోని జాతీయ మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుబంధ శాఖలలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ శనివారం రాత్రి వరకు జరిగిన సందర్భంగా మొత్తం రూ.95వేలు పెనాల్టీ, రూ.29,777 రికవరి చేసినట్లు అడిషనల్ పిడి ఎస్. మాధవిలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, హౌసింగ్, పంచాయతీ రాజ్,పశుసంవర్ధకశాఖ శాఖలో జరిగిన పనులపై గ్రామాల్లో 2023 ఏప్రెల్ ఒకటి నుండి 2024 అక్టోబరు 31 వరకు వరకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామ సభలు పనులు తనిఖీ నిర్వహించి నట్లు తెలిపారు. ఈ తనిఖీలో ఆలూరు ఎఫ్ఎ కు రూ.26వేలు పెనాల్టీ, అరికేర రూ.2వేలు, అరికేర తండా రూ.2వేలు, హత్తిబెళగల్ రికవరి ఒక వేయి, రూ.5వేలు పెనాల్టీ, హులేబీడు రూ 586 రికవరి, కమ్మరచేడు రూ.4వేల500 రికవరి, రూ17వేలు పెనాల్టీ,కురవల్లి రూ.8వేలు పెనాల్టీ,కురుకుంద రూ.2వేలు పెనాల్టీ,మరకట్టు రూ.16వేల145 రికవరి,రూ.13వేలు పెనాల్టీ, మొలగవల్లి 278 రికవరి,6వేలు పెనాల్టీ, ముద్దన గేరి రూ.1000 పెనాల్టీ, ముసానహళ్లి రూ.5వేలు పెనాల్టీ,పెద్దహోతూరు 6వేలు పెనాల్టీ,తుంబలబీడు రూ.7వేల రూ.268 రికవరి, రూ.2వేలు పెనాల్టీ వేసినట్లు తెలిపారు.డిఈఓ లోకేష్,ఏపిడి పద్మావతి,ఎపిఓ శ్రీనివాసులు, ఇసి మరెన్న,పిఆర్ ఎఇ చౌడరెడ్డి, డిఆర్‌పి లు, టిఏ లు, ఎఫ్ఏ లు రైతులు పాల్గొన్నారు.

ఆలూరు సాజిక తనిఖీలో విరాలు సేకరిస్తున్న ఎపిడి మాధవిలత

కవి ఆన్నె శ్రీనివాస రెడ్డిని సన్మానిస్తున్న గ్రంధాలయ అధికారి

గంథ్రాలయ వారోత్సవంలో కవిసమ్మేళనం

ప్రజాశక్తి - ఆలూరు: మండల పరిధిలోని మొలగవల్లి శాఖా గ్రంధాలయం నందు 57 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా కవి సమ్మేళనాలు రచయితల సందేశాలు నిర్వహించారు. ఆదివారం గ్రంధాలయ అధికారి విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో కవి ఆన్నె శ్రీనివాస రెడ్డిని సన్మానించారు. పౌరాణిక పాత్రధారులు తమ ప్రదర్శనను ప్రదర్శించారు.కవి తన చాతుర్యంతో పాఠకులను శ్రోతలను అలరించారు. గ్రంధాలయ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అదేవిధంగా ప్రతీ ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని విద్యార్థులకు పాఠకులకు తెలియచేసారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రంగన్న, పంచాయితీ సూపర్వైజర్ రామాంజినేయులు,వన్నప్ప, రామాంజినేయులు, కాక భూపేశ్, బాలన్న, ఇన్చార్జి హెడ్ మాస్టర్ మధుసూదన్ నాయుడు, పౌరాణిక పాత్రధారులు శీనప్ప, గోపీని రంగన్న, గోపీని ఈరన్న పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వికాసం

ప్రజాశక్తి - ఆదోని

పుస్తక పఠనంతో వ్యక్తిగత వికాసంతో పాటు విజ్ఞానం, నైపుణ్యతను పెంపొందించుకోవచ్చని తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున, గంథాలయ అధికారిని సుజాత అన్నారు. ఆదివారం గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రాజు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యను ఎవరు దోచుకునేది కాదని జ్ఞానం పెంపొందించుకోవాలంటే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తోమంది గొప్ప మహానుభావుల, రచయితల, జీవిత గ్రంథాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రామ్మూర్తి నాయుడు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మతి టీడీపీ పార్టీకి తీరని లోటు అని ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు రాందాస్ గౌడ్ కొండయ్య చౌదరి, రంగస్వామి గౌడ్, మల్లికార్జున, ఫరూక్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నారా రామ్మూర్తి మతి పట్ల వారు సంతపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ 1994-1999 మధ్య కాలంలో చంద్రగిరి శాసనసభ్యులుగా రామ్మూర్తి నాయుడు అందించిన సేవలు మరవలేనివని కొనియాడారు.

శ్రీ మఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం బందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు. అంతకు ముందు రాఘవేంద్రుని బందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బందావనాన్ని స్వర్ణ కవచాలతో పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు, రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు.

ఆదివారం మంత్రాలయానికి భారీగా తరలివచ్చిన వివిధ రాష్ట్రాల యాత్రికులు, భక్తులు

ఆకట్టుకున్న సాంఘిక నాటకం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

మన సమాజంలో స్వేచ్ఛ ఉంది కానీ, అనేక సాంస్కృతిక దాడులు ఈ దేశాన్ని చుట్టూ ముట్టాయి. పెళ్లి కాకుండానే కలిసి ఉండటం అనే దిక్కుమాలిన సంస్కృతి ఇప్పుడు మనదేశంలో అడుగుపెట్టింది. ఇద్దరు సంపాదిస్తారట పిల్లల్ని కనరట. ఇది ఈ దేశానికి వినాశకరం అని సందేశాన్ని ఇచ్చే "ఇది రహదారి కాదు" అనే నాటకాన్ని మిత్ర క్రియేషన్స్ ఆర్ట్స్ హైదరాబాద్ వారు ఆదివారం రాత్రి టీజీవి కళాక్షేత్రంలో ప్రదర్శించారు. నాటక ప్రదర్శనకు ముందు రచయిత జ్యోతి, దర్శకులు ఆకురాతి భాస్కర్ చంద్ర, ఎస్ఎం భాషలను సత్కరించి నాటక ప్రదర్శనకు రూ.20వేల పారితోషికాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ రాయలసీమలో సాంఘిక నాటకానికి ఆదరణ పెంచడం కోసం ప్రతినెల ఒక సాంఘిక నాటకాన్ని రాష్ట్రంలోని ప్రముఖ నాటక సంస్థలను ఆహ్వానించి ప్రదర్శన చేయిస్తున్నామన్నారు. అందులో భాగమే ఈ నాటక ప్రదర్శన అని తెలిపారు. దర్శకులు భాష రచయిత భాస్కర్ చంద్ర మాట్లాడుతూ కర్నూలులో గొప్ప ఆడిటోరియం ఉందని టి జి వి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన లైటింగ్ సౌండ్ సిస్టం ఇతర ఏర్పాట్లు రాష్ట్రంలోని అతికొద్ది కళాక్షేత్రాలకు మాత్రమే ఉన్నాయన్నారు. కళాకారులు దేవేష్, జగదీష్, భాస్కరరావు, సాయి మురళి, నాగరాణి,సింధూరి పూజిత నటించిన ఇది రహదారి కాదు నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. బిసి జాతీయ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంగనాయకులు, కళాక్షేత్రం నిర్వాహకులు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాటకాన్ని ప్రారంభిస్తున్న పత్తిఓబులయ్య

పుస్తక పఠనంపై అవగాహన

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని కవి రత్న ఆరికంటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గ్రంథాల వారోత్సవాల్లో భాగంగా పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. తేనెటీగ లాంటి గ్రంథాలయం వివిధ రకాల పుస్తకాలు ద్వారా పాఠకులు మకరందం లాంటి జ్ఞానాన్ని ఆచరించాలని అన్నారు. గ్రంథాలయ ఇన్చార్జి హరికృష్ణ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నాల్గవ రోజున కవిసమ్మేళనం , సెమినార్లు. రచయితల సందేశాలపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికవిరత్న అరికెంటి నాగేశ్వరరావు. రత్తయ్య శెట్టి నీలకంఠ. బసవరాజ్ టీచర్ హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయ అవశ్యకత ను గూర్చి వివరించారు. మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం వల్ల పరిజ్ఞానం పెంచుకొని అనేక మార్పులు రావడం వల్ల ఉన్నత శిఖరాలకు పయనించే దశలో ఉన్నాయన్నారు. వీరనాయకులు గాథను వివరించారు. పుస్తకాల ప్రాముఖ్యతను తెలిపారు.

తిమ్మారెడ్డి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-హొలగుంద

మండలంలోని ఇంగలదహాల్ గ్రామంలో దేవరగట్టు ఆలయ మాజీ చైర్మన్, శ్రీశైల దేవస్థాన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కేసి తిమ్మారెడ్డి 107వ జయంతి వేడుకలు కేసి తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎంపీటీసీ మల్లికార్జున, యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామానికి అనేక విధాలుగా సేవలు అందించిన వ్యక్తి అని, గ్రామంలో విద్యా, రవాణా, పోస్టు, టెలిఫోన్ వంటి వాటిని నాటికే గ్రామానికి తెచ్చారని తెలిపారు. 1961లోనే గ్రామానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర వసతి గృహం తీసుకురావడం చాలా గర్వించదగ్గ విషయం అన్నారు. ఆయన సాధించిన వాటిని మనం అందరూ కాపాడుకోవాలని కోరారు.కార్యక్రమంలో యూత్ సభ్యులు బోడి, పాండు, చంద్రశేఖర్, రాజు, దస్తగిరి, ఎస్ఎఫ్ఐ మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు ఆశావర్కర్ల కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - ఆస్పరి

ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరం కోసం సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో వేతనాలు,కార్మిక,సామాజిక భద్రత ప్రస్తావనే లేదన్నారు. ఆశ వర్కర్స్ కు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని,ఎన్ సి డి సర్వేలు రద్దు చేసి,కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ని ఆశలుగా మార్పు చేయాలని,10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని,62 సంవత్సరాల రిటైర్మెంట్ జీవోని వర్తింప చేయాలని,వెయ్యి జనాభాకు ఒక ఆశ వర్కర్ ను నియమించి, ఏఎన్ఎం హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజ్‌ని ఇవ్వాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని డిమాండ్ చేశారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అవయవదానానికి కౌన్సిలర్ అంగీకారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ దయాసాగర్ హైదరాబాద్‌కు చెందిన మోహన్ ఫౌండేషన్ వారికి ఆర్గాన్ డొనేషన్ పై సంతకం చేసినట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చనిపోయిన తర్వాత ఎందుకు పనికిరాని మన శరీరం ఒకరికి ఉపయోగ పడుతుందంటే అది మంచిదని ఉద్దేశించి ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఇలా డొనేషన్ చేయదలచిన వారు తనను సంప్రదించవలసిందిగా కోరారు. అలాగే త్వరలో ఒక ఫౌండేషన్ ప్రారంభించ నున్నానని మంచి కార్య క్రమాలకు నిర్వ హిస్తానని తెలిపారు. ఆర్గాన్ డొనేషన్ చేయ దలచిన వారు ఈ ఫోన్ నంబర్లను 7981049949, 9490520288 సంప్రదించగలరని తెలిపారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No. 14/2018 in O.S. No. 202/2005

సున్నితి చంద్రశేఖర్,
తండ్రి ఎస్. రాధాకృష్ణమూర్తి,
R/o. కోవెలకుంట్ల గ్రామం మరియు మండలం,
నంద్యాల జిల్లా. ... D.Hr

-Vs-

సకల చంద్రయ్య Died by his Lrs.
1) సకల సూర్యమ్మ, W/o. Late ఎస్. చంద్రయ్య,
2) సకల రాజేష్, S/o. Late ఎస్. చంద్రయ్య,
Both are R/o. H.No. 21-91,
Near Kasturi English Medium School.
1 Town, కర్నూలు టౌన్ మరియు జిల్లా.
... J.Drs.

పై E.P. నందు D.Hr. తన డిక్రి మొత్తం పైకం రాబట్టుకొనుటకు దాఖలు చేసియున్నారు. పై E.P. లో మీకు కోర్టు నోటీసులు ముట్టనందున మరియు ఆచూకి తెలియనందున కోర్టు వారు 26/11/2024 వ తేదీన మీ సమాధానము కొరుకు వాయిదా వేసి ఉంటున్నారు. ఆ దినము ఉదయం 10-00 గంటలకు మీ వకీలు ద్వారా కాని, మీరు కాని కోర్టుకు హాజరు అయ్యి సమాధానం ఇచ్చు కోవలసి ఉంటుంది. అట్లు తప్పిన యెడల మీ పరోక్షమున కోర్టు వారు ఉత్తర్వుల పాలింతురు.

(కోర్టు వారి ఉత్తర్వులతో)

షేక్ ఖాసీం సాహెబ్
D.Hr న్యాయవాది, కోవెలకుంట్ల,
సెల్ : 7981551854